సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 4 । జూన్ । 2024



11మంది అరెస్ట్
కేయూలో ఆన్సర్ బుక్‌లెట్లు మార్చిన కేసులో 11మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సంజీవ సోమవారం తెలిపారు. - 8లో▸



కాంగ్రెస్ వేడుకలా దశాబ్ది ఉత్సవాలు..
తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను కాంగ్రెస్ సొంత కార్యక్రమంలా నిర్వహించారని మంద కృష్ణ మాదిగ అన్నారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36^0 /28^0
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కౌంటింగ్‌కు 2,500 మంది సిబ్బంది
ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ప్రావీణ్య




సాక్షి, వరంగల్: వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడు (మంగళవారం) భారీ భద్రత నడుమ నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏనుమాముల మార్కెట్ యార్డులోని 17, 18, 19 నంబర్ల గోడౌన్‌లోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)లో నిక్షిప్తమైన ఓట్లతో పాటు పోస్టల్ బ్యాలెట్‌లను ఉదయం 8గంటల నుంచి లెక్కించేలా సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు ఓట్ల లెక్కింపు కేంద్రాలను డీసీపీ రవీందర్, అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, సంధ్యారాణి, డీఆర్‌ఓ శ్రీనివాస్‌లతో కలిసి క్షేత్ర స్థాయిలో వరంగల్ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య సోమవారం తనిఖీ చేశారు. పోస్టల్‌బ్యాలెట్‌కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం కౌంటింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు 2,500 సిబ్బంది పాల్గొంటున్నట్లు తెలిపారు. నాలుగో తేదీ ఉదయం 6 గంటలకు కౌంటింగ్ పరిశీలకుల సమక్షంలో తుది ర్యాండమైజేషన్ నిర్వహించి సిబ్బందిని కేటాయిస్తామన్నారు. రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నామని, కార్డులు లేని వ్యక్తులు, సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ సెంటర్ లోనికి అనుమతించమన్నారు. రౌండ్‌ల వారీగా ఫలితాలు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసే విధంగా ఐటీ సిబ్బందిని సన్నద్ధం చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

400 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు
వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



వరంగల్: ఏనుమాముల మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద 400 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సోమవారం కౌంటింగ్ కేంద్రమైన గోదాముల వద్ద బందోబస్తులో విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి కేవలం ఎంపీ ఎన్నికల్లో పోటీదారులు, సంబంధిత ఏజెంట్లు, పాసులు ఉన్నవారికి అనుమతి ఉంటుందన్నారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత ఎటువంటి ర్యాలీలు, సభలకు అనుమతి లేదని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారులు తమకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహించి ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో మంగళవారం 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమావేశంలో డీసీపీలు రవీందర్, అబ్దుల్ బారీ, అదనపు డీసీపీ రవితోపాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీస్ అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు
పరిశీలకులు రన్బీర్‌చంద్



వరంగల్: ఏనుమాముల మార్కెట్‌లోని లెక్కింపు కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కౌంటింగ్ పరిశీలకులు బండారి స్వాగత్ రన్బీర్ చంద్ అన్నారు. సోమవారం సాయంత్రం వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి అసంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం124 టేబుళ్ల, 127 రౌండ్లలో లెక్కింపు చేస్తారన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేశామని తెలిపారు. గుర్తింపు కార్డులు లేని వ్యక్తులకు లోనికి అనుమతించరని తెలిపారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు ఎలక్ట్రానిక్ వస్తువులు తదితర వస్తువులకు అనుమతి లేదన్నారు. ఆమెవెంట అదనపు కలెక్టర్‌లు రాధిక గుప్తా, సంధ్యారాణి, జిల్లా నోడల్ అధికారులు, తహసీల్దార్లు ఇక్బాల్, విజయ్, ఎన్నికల అధికారులు ఉన్నారు.

ప్రగతి పథం.. ఉపాధికి ఊతం

పారిశ్రామిక రంగానికి పెద్దపీట
- ఇండస్ట్రియల్ పార్కు, మెగా టెక్స్‌టైల్ పార్కు
- స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్స్‌తో రైతులకు ప్రయోజనం
- 2014 నుంచి టీఎస్ ఐఐసీ ద్వారా పారిశ్రామిక ప్రగతి
- మౌలిక వసతుల అభివృద్ధితో వేలాది మందికి ఉపాధి
- 'సాక్షి'తో టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్





వ్యవసాయమే ప్రధాన వనరుగా ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లా క్రమంగా పారిశ్రామిక ప్రగతికి చిరునామాగా మారుతోంది. ఆసియాలో అది పెద్ద మార్కెట్‌లలో ఒకటిగా ఉన్నా వరంగల్‌లోని ఏనుమాముల మార్కెట్ ఇప్పటికే ఎంతోమంది రైతుల ఉత్పత్తుల క్రయవిక్రయాలకు అడ్డాగా ఉంది. ఇదే కోవలోనే వ్యవసాయ ఆధారిత ఉత్పత్తి కంపెనీలతోపాటు 2014లో ఏర్పాటైన తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సహకారంతో ఇండస్ట్రియల్ పార్కు, మెగా టెక్స్‌టైల్ పార్కు, స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్స్, స్పెషల్ ఎకానమిక్ జోన్‌లు ఏర్పాటవుతున్నాయి. గత పదేళ్లలో వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్ జిల్లాలో పారిశ్రామిక ప్రగతి వైపు అడుగులు వేసింది. ఇలా 2014నుంచి 2024 వరకు పదేళ్లలో ఏమేమీ కంపెనీలు వచ్చాయి.. ఎంతమందికి ఉద్యోగావకాశాలు లభించాయి.. మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి ఎలా జరిగిందనే దానిపై టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్ సోమవారం 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

\- సాక్షి, వరంగల్

- పూర్తి వివరాలు 8లో▸

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు కేంద్రాలు ఇలా..
(ఎంపీ స్థానం : వరంగల్, కౌంటింగ్ కేంద్రం: అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ, ఏనుమాముల)

- **వరంగల్ తూర్పు** ▶ గోడౌన్ నంబర్ 17/బీ, ఈ నియోజకవర్గంలో 1,68,234 ఓట్లు పోల్‌కాగా, 14 టేబుల్స్, 17 రౌండ్లలో లెక్కింపు
- **వరంగల్ పశ్చిమ** ◀ గోడౌన్ నంబర్ 19/డీ, 1,49,320 ఓట్లను 18 రౌండ్లలో లెక్కించేందుకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు.
- **పాలకుర్తి**: గోడౌన్ నంబర్19/బీ, పోలైన 1,82,515 ఓట్లను 17 టేబుళ్ల, 18 రౌండ్లలో లెక్కిస్తారు.
- **వర్ధన్నపేట (ఎస్సీ)**: గోడౌన్ నంబర్17/ఏ, ఈ అసెంబ్లీ పరిధిలో 1,97,763ఓట్లకు 16 టేబుళ్లు ఏర్పాటుచేశారు. 18 రౌండ్లలో లెక్కింపు.
- **పరకాల:** గోడౌన్ నంబర్ 19/సీ, 1,70,916 ఓట్లు పోల్‌కాగా, 14 టేబుళ్ల, 18 రౌండ్లలో లెక్కిస్తారు.
- **భూపాలపల్లి:** గోడౌన్ నంబర్ 17/డీ, ఈ అసెంబ్లీలో 1,87,395 ఓట్లను 18 టేబుళ్ల, 18 రౌండ్ల కౌంటింగ్.
- **స్టేషన్ ఘనపూర్ (ఎస్సీ)** ▶ గోడౌన్ నంబర్ 19/ఏ, 2,00,158 ఓట్లు పోల్‌కాగా, 18 రౌండ్లలో లెక్కించేందుకు 17 టేబుళ్లు ఏర్పాటు చేశారు.
- **పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు** ◀ గోడౌన్ నంబర్ 18/సీ, పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్లను లెక్కిస్తారు.



నేడే విడుదల!

వరంగల్ లోక్‌సభ ఫలితాల వెల్లడికి సిద్ధం.. ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు

- వరంగల్ ఏనమాముల మార్కెట్ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి
- మూడంచెల భద్రత నడుమ ప్రక్రియ.. ఉత్కంఠకు నేడు తెర
- మధ్యాహ్నం వరకు తేలనున్న ఫలితం.. సాయంత్రం అధికార ప్రకటన వెలువడే అవకాశం
- ఓట్ల లెక్కింపు కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకుడిగా రాజేశ్‌కుమార్
- కౌంటింగ్ కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు.. ర్యాలీలు, వేడుకలు నిషేధం



ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటుచేసిన బారికేడ్లు





పోస్టల్ బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న ఆర్‌ఓ ప్రావీణ్య, పరిశీలకులు రన్బీర్‌చంద్, కేంద్రంలోని ఐటీ వింగ్

సాక్షిప్రతినిధి, వరంగల్ :

ఎప్పుడెప్పుడాని ఎదురుచూస్తున్న లోక్‌సభ స్థానాల ఫలితాల వెల్లడికి వేళయ్యింది. పోటాపోటీగా సాగిన వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల ఫలితం ఇంకొద్ది గంటల్లోనే తెలిసిపోనుంది. పోలింగ్ ముగిసిన తరువాత సుమారు 22 రోజుల నిరీక్షణ.. జిల్లా నాయకులు, రాజకీయ పార్టీల ప్రముఖుల ఉత్కంఠకు మంగళవారంతో తెరపడనుంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు నేడు వెల్లడి కానున్నాయి. వరంగల్ పార్లమెంటు ఓట్ల లెక్కింపును నగరంలోని ఏనుమాముల మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్నారు. లెక్కింపు ప్రక్రియ కోసం అధికారులు పదిరోజుల ముందుగానే ఏర్పాట్లను ప్రారంభించారు. కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన ఓట్ల లెక్కింపు పరిశీలకులు, ఐఏఎస్ అధికారులు రాజేశ్‌కుమార్, బండారు స్వాగత్ రన్బీర్‌చంద్ పర్యవేక్షించనున్నారు. ఈ మేరకు ఏనుమాముల మార్కెట్ గోదాములలో నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన టేబుళ్లు, ఇతర ఏర్పాట్లను రాజేశ్‌కుమార్, స్వాగత్ రన్బీర్‌చంద్, వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఇతర అధికారులు సోమవారం సాయంత్రం వరకు పరిశీలించారు. కౌంటింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించిన వీరు లెక్కింపులో పాల్గొనే అధికారులు, సిబ్బందికిసూచనలు చేశారు.

ఓట్ల లెక్కింపునకు అధికారుల ప్రణాళిక ఇదీ

వరంగల్ పార్లమెంట్‌లో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలోని పోలింగ్ కేంద్రాల సంఖ్య, పోలైన ఓట్లను బట్టి మొత్తం 124 టేబుళ్లపై.. 127 రౌండ్లలో ఓట్లను లెక్కించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. లోక్‌సభ స్థానంలో మొత్తం 18,24,466 ఓట్లకుగాను 12,56,301 ఓట్లు పోలయ్యాయి. వరంగల్ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్ ఓట్లను 17 రౌండ్లలో లెక్కించనుండగా.. మిగతా ఆరు సెగ్మెంట్లలో 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఒక్కో రౌండ్ 10 నుంచి 15 నిమిషాల వ్యవధి పట్టే అవకాశముండగా, ఏడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తయ్యాకే రౌండ్ల వారీగా క్రోడీకరించి వివరాలను వెల్లడించనున్నట్లు ఆర్‌ఓ ప్రావీణ్య ప్రకటించారు. ఈవీఎం కౌంటింగ్ సంబంధించి ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్‌లు ఉంటారు. మైక్రో అబ్జర్వర్‌తో కలిసి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రౌండ్ ప్రకారం రిజల్ట్ నమోదు చేస్తారు. పోస్టల్ బ్యాలెట్ సంబంధించి ప్రత్యేక హాల్.. హోమ్ ఓటింగ్, విధుల్లో ఉన్న సిబ్బంది సంబంధించిన ఓట్లను 14 టేబుల్స్ ద్వారా లెక్కించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒక్కో టేబుల్‌కు సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు, తహసీల్దార్ స్థాయి ఏఆర్‌ఓ ఉంటారు. సర్వీసు ఓటర్లకు సంబంధించి ఈటీపీబీఎస్ పద్ధతిలో స్కానింగ్ ద్వారా కౌంటింగ్ నమోదు చేస్తారు.

గెలుపుపై అందరి ధీమా..

వరంగల్ పార్లమెంట్ స్థానం బరిలో మొత్తం 42 మంది అభ్యర్థులు ఉండగా.. సుమారు 15 రోజుల పాటు ప్రచారం నిర్వహించిన మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారుగా గెలుపుపై ధీమాను వ్యక్తం చేశారు. ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరగ్గా.. సుమారు 22 రోజుల తర్వాత ఫలితం నేడు వెలువడనుంది. అరూరి రమేష్ (బీజేపీ), డా. కడియం కావ్య (కాంగ్రెస్), డా.మారెపల్లి సుధీర్‌కుమార్ (బీఆర్‌ఎస్)లను గెలుపు శిఖరాలకు చేర్చేందుకు పార్టీలు సర్వశక్తులు ఒడ్డాయి. ఆయా పార్టీల అధినేతలు, మంత్రులు, రాష్ట్రస్థాయి నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. అభ్యర్థులు కూడా ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు వ్యూహాత్మకంగా ముందుకు సాగారు. ఏదేమైనా కొద్దిగంటల్లోనే పార్లమెంట్ ఎన్నికల ఫలితాల ఉత్కంఠకు తెరపడనుంది.

8 గంటలకు కౌంటింగ్ మొదలు..

మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం కానుండగా, మొదటగా పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓట్లను లెక్కిస్తారు. కంట్రోల్ యూనిట్లు, ఈవీఎంలను స్ట్రాంగ్ రూముల్లోంచి టేబుళ్ల మీదకు తీసుకొచ్చి.. సరిచూసుకొని.. జరగబోయే ప్రక్రియపై అభ్యర్థుల ఏజెంట్లకు వివరించి లెక్కింపు ఆరంభిస్తారు. మొదటిసారి కొంత ఎక్కువ సమయమే పట్టనుండగా రెండో రౌండ్ నుంచి ఫలితం వెల్లడిలో వేగం పుంజుకునే అవకాశం ఉంటుంది. రెండు రౌండ్లకల్లా సిబ్బందికి కూడా అవగాహన కలిగి ప్రక్రియ సులువయ్యే అవకాశం ఉంది. ఈ లెక్కన తొలి రౌండ్ ఫలితం ఉదయం 9.30 కల్లా వచ్చేస్తుందని అధికారుల అంచనా. ఈవీఎంల లెక్కింపు మధ్యాహ్నం ఒంటి గంటకల్లా ముగుస్తుందని సమాచారం. విజేత ఎవరనేది మధ్యాహ్నం కల్లా తెలిసినా, అధికారిక ప్రకటన మాత్రం సాయంత్రం 4.30 గంటల తర్వాతే వెలువడే అవకాశం ఉంటుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశానుసారం ఓట్ల లెక్కింపు ప్రక్రియలో కచ్చితత్వంతో కూడిన ఫలితాలు వెలువడ్డాయో లేదో తెలుసుకునేందుకు ఒక్కో నియోజకవర్గంలో ర్యాండమ్‌గా ఎంపిక చేసిన ఐదు వీవీప్యాట్ల ఓట్లనే లెక్కిస్తారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన టేబుళ్లలోని ఓట్ల లెక్కలతో సరిపోలుస్తారు. ఈవీఎంల ఓట్ల వివరాలు, వీవీ ప్యాట్లలోని ఓట్ల సంఖ్యలో తేడాలుంటే.. వీవీ ప్యాట్లలోని ఓట్ల సంఖ్యనే పరిగణనలోకి తీసుకుంటారు. అందుకే వీవీ ప్యాట్లలో ఓట్లు లెక్కించే సరికి సాయంత్రం 4.30 కానుంది. ఆ తర్వాతే విజేత పేరును అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

మూడంచెల భద్రత.. భారీగా పోలీసులు..

కౌంటింగ్ కోసం పోలీసులు మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రతి స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం వద్ద సీఐఎస్‌ఎఫ్ భద్రతా సిబ్బందితోపాటు స్టేట్ సాయుధ సిబ్బంది, ఏఆర్ ఫోర్స్, సివిల్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అందుబాటులో ఉంచారు. పాస్‌లు లేకుండా ఎవరినీ అనుమతించవద్దన్న పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. రిటర్నింగ్ అధికారి, అబ్జర్వర్స్, అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. కాగా మీడియా కోసం ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేశారు. మీడియా సిబ్బంది ఎస్కార్ట్ అధికారితో వెళ్లి కవర్ చేసేలా సూచించిన అధికారులు అభ్యర్థులకు మాత్రం అన్ని సెగ్మెంట్లకు అనుమతి ఉంటుందన్నారు. పోలింగ్ ఏజెంట్లకు మాత్రం వారి కౌంటింగ్ హాలుకు మాత్రమే పరిమితం కావాలి. అలాగే కౌంటింగ్ కేంద్రం పరిధిలో 144 సెక్షన్ అమలుతో పాటు ర్యాలీలు, విజయోత్సవ వేడుకలను నిషేధించారు.

అమరవీరుల కుటుంబాన్ని సన్మానిస్తున్న మంత్రులు పొన్నం, సీతక్క తదితరులు





సబ్బండ వర్గాల కృషితోనే తెలంగాణ

- మంత్రులు పొన్నం ప్రభాకర్, ధనసరి సీతక్క
- తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం

హనుమకొండ హంటర్ రోడ్డులోని 'డీ' కన్వెన్షన్ హాల్‌లో సోమవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తొలి, మలిదశ ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

\- హన్మకొండ చౌరస్తా

- వివరాలు 8లో▸

కాంగ్రెస్ సన్మానంతో ఘోషిస్తున్న అమరుల ఆత్మ




సన్మానం పొందిన తెలంగాణ ఉద్యమకారులతో వినయ్‌భాస్కర్, పెద్ది, బండా ప్రకాశ్ తదితరులు

బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హన్మకొండ: తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్ సన్మానించడంతో అమరుల ఆత్మ ఘోషిస్తుందని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. ముందుగా తెలంగాణ అమరవీరుల స్తూపానికి నాయకులు పూలమాల వేసి నాయకులు నివాళి అర్పించారు. తెలంగాణ తల్లికి పూలమాల వేశారు. అనంతరం శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్ రెడ్డిలు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ సాధన ఉద్యమక్రమంపై రూపొందించిన డాక్యుమెంటరీ ప్రదర్శించారు. తెలంగాణ 1969, మలిదశ ఉద్యమకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో, అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులను సన్మానించడం హంతకులే సంతాప సభ పెట్టినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ లోగోనుంచి కాకతీయ కళాతోరణాన్ని తొలగించడం వరంగల్, తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతీయడమేనన్నారు. మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ ఉద్యమంతో సంబంధం లేని, ఉద్యమ బాధ్యత నిర్వహించని వారు తామే చాంపియన్‌లమని అనుకుంటున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అధికారంలోకి వస్తే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను ఆంధ్రప్రదేశ్‌లో కలిపే కుట్ర జరుగుతుందని ఆరోపించారు. లోగో మార్పుపై జరిగిన చర్చలో పాల్గొన్న వారిలో ప్రొఫెసర్ కోదండరాం ఒక్కరే ఉద్యమకారుడని, మిగతావారంతా ఉద్యమంలో సంబంధం లేని వారేనన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జెడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్ కుమార్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, నాయకులు మర్రి యాదవ రెడ్డి, పులి రజనీకాంత్, సోదా కిరణ్, బండి రజనీకుమార్, నయిముద్దీన్, రామ్మూర్తి, జోరిక రమేష్, చాంగంటి రమేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పాలిసెట్‌లో సాయిచంద్రకు డిస్ట్రిక్ట్ ఫస్ట్ ర్యాంకు

రాష్ట్రస్థాయిలో 34వ ర్యాంకు



తల్లిదండ్రులతో సాయిచంద్ర

వరంగల్: వరంగల్ ఎల్‌బీనగర్‌కు చెందిన వెల్దండి శ్రీనివాస్, స్వప్న దంపతుల కుమారుడు సాయిచంద్ర పాలిసెట్-2024లో ఎంబైపీసీలో రాష్ట్రస్థాయిలో 34వ ర్యాంకు, ఎంపీసీ కేటగిరిలో 115వ ర్యాంకు సాధించగా వరంగల్ జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిన సాయిచంద్ర 10వ తరగతిలో 9.8 జీపీఏ సాధించారు. అతని తండ్రి శ్రీనివాస్ గుమస్తాగా పనిచేస్తుండగా, తల్లి ఇంటి వద్దే పిల్లలకు ట్యూషన్‌లు చెబుతూ జీవనం సాగిస్తున్నారు. జిల్లా స్థాయిలో పాలిసెట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన సాయిచంద్రను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సాయిచంద్ర మాట్లాడుతూ పాలిసెట్‌లో ఉత్తమ ర్యాంకు వచ్చినప్పటికి ఐఐటీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ చదవడమే తన లక్ష్యమన్నారు. అందుకోసం ఐటీఐలో చేరబోనని, ఇంటర్‌లో ఎంపీసీ తీసుకుని తరువాత ఐఐటీ సీటు సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

పాలిటెక్నిక్‌లో విద్యార్థుల ప్రతిభ 10లో

భారీ వాహనాలతో ఇబ్బందులు

- అడ్డుకున్న మడికొండవాసులు
- స్తంభించిన ట్రాఫిక్



మడికొండ చౌరస్తాలో భారీ వాహనాలను అడ్డుకున్న స్థానికులు

మడికొండ: మడికొండ చౌరస్తా నుంచి ధర్మసాగర్ మీదుగా భారీ వాహనాలు రావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు సోమవారం రాత్రి చౌరస్తాలో వాటిని అడ్డుకున్నారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు భారీ వాహనాలకు గ్రామంలోకి అనుమతి లేదని బోర్డులు ఏర్పాటు చేసినా పట్టించుకోకుండా రావడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి పోలీసులకు సూచనలు చేయగా బోర్డులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో తాము వాహనాలను అడ్డుకున్నట్లు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి ఆందోళనకారులను శాంతింపజేసి పంపించేశారు.

క్లుప్తంగా

ఆన్సర్ బుక్‌లెట్ల మార్పిడి ఘటనలో 11 మంది అరెస్ట్



కేయూ క్యాంపస్ : డిగ్రీ కోర్సుల ఆరో సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి కొందరు విద్యార్థులు రాసిన ఆన్సర్ బుక్‌లెట్లు తీసి మళ్లీ ఆయా విద్యార్థులకు అందజేసి వారితో జవాబు రాయించుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా జవాబుపత్రాల బండిల్స్‌లో పెడుతున్న దందా ఇటీవల కేయూలో వెలుగు చూసిన విషయం విధితమే. ఈ ఘటనపై పరీక్షల విభాగం అధికారుల ఫిర్యాదు మేరకు సోమవారం 11 మందిని (దినసరి వేతన కూలీలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు) అరెస్ట్ చేసినట్లు కేయూ సీఐ సంజీవ తెలిపారు. అరెస్ట్ అయినవారిలో మాదాసి సునీల్, గడ్డం రాణాప్రతాప్, నాసమ్ శ్రీధర్, బి పృథ్వీరాజ్, బైరి రమేశ్, చట్ల సందీప్, ఎస్ పవన్‌కుమార్, పొన్నాల నితీశ్, పాలెపాక శ్రీకాంత్, దేవరకొండ రాజేశ్, చీకటి రాకేశ్ ఉన్నారని వివరించారు. వీరిపై కేసులు నమోదు చేసి ఎంజీఎంలో వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మరో ఎనిమంది పై కూడా కేసు నమోదు చేశామని, వారు పరారీలో ఉన్నారని సీఐ పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు.

బుక్‌లెట్లు మార్పించుకున్న వ్యవహారంలో 62 మంది విద్యార్థులు?

ఆన్సర్ బుక్‌లెట్లు మార్పించుకున్న వ్యవహారంలో 62మంది విద్యార్థులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారని సమాచారం. ఇందులో ఎక్కువ మంది రెండు ప్రముఖ కళాశాలల విద్యార్థులు ఉన్నారని తెలిసింది. ఇందులో కొందరు విద్యార్థులు ఇప్పటికే ఫైనల్ ఇయర్ కోర్సుల్లో వివిధ సబ్జెక్టుల్లో ఫెయిలై మళ్లీ ఇటీవల జరిగిన ఆరో సెమిస్టర్ పరీక్షలు రాశారని తెలుస్తోంది. ఆన్సర్ బుక్‌లెట్లు మార్పించుకున్న వ్యవహారంలో విద్యార్థులతోపాటు విద్యార్థినులు కూడా ఉన్నట్లు సమాచారం. పోలీసుల దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. సదరు విద్యార్థులపై కేసులు నమోదు చేస్తారా లేదా అనే విషయం వేచి చూడాల్సిందే.

లింకుపై క్లిక్..

- బ్యాంకు ఖాతా నుంచి రూ.3.82 లక్షలు మాయం
- కేసముద్రం విలేజ్‌లో ఘటన

కేసముద్రం: ఓ బ్యాంకు పేరుపై వాట్సాప్‌లో వచ్చిన లింకును ఓ వ్యక్తి క్లిక్ చేశాడు. దీంతో తన ఖాతాలో ఉన్న రూ.3.50లక్షలకు పైగా మాయమయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రంవిలేజ్‌లో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. కేసముద్రంవిలేజ్‌కి చెందిన ఓ వ్యక్తి తన ఖాతాకు సాంకేతిక లోపం రావడంతో నాలుగురోజుల క్రితం బ్యాంకుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఈనెల 1న సదరు బ్యాంకు నుంచి లింక్ ఓపెన్ చేయాలంటూ వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో తన ఖాతాకు ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సవరించడానికే బ్యాంకు నుంచి మెసేజ్ పంపి ఉంటారనే ఉద్దేశంతో అతడు ఆ లింక్‌ను క్లిక్ చేసి అందులో పేర్కొన్న విధంగా వివరాలు నమోదు చేశాడు. దీంతో ఆదివారం రాత్రి అతడి క్రెడిట్ కార్డు నుంచి రూ.86,300, ఏటీఎం కార్డు నుంచి రూ.2,96,485 డ్రా చేసినట్లు మెసేజ్ వచ్చింది. ఇలా 8 సార్లు ఫోన్‌కు ఓటీపీ రావడంతోపాటు ఆటోమెటిక్‌గా జనరేట్ అయి తన ఖాతాలోని డబ్బును దుండగులు డ్రా చేసుకున్నారు. దీంతో ఆందోళన చెందిన బాధితుడు సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేశాడు.

ప్రగతి పథం.. ఉపాధికి ఊతం

- 'సాక్షి'తో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్

సాక్షి, వరంగల్: వ్యవసాయమే ప్రధాన వనరుగా ఉన్న ఉమ్మడి వరంగల్ కాలక్రమేణా పారిశ్రామిక ప్రగతికి చిరునామాగా మారుతోంది. టెక్స్‌టైల్స్, స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు, స్పెషల్ ఎకానమిక్ జోన్లు ఏర్పాటవుతున్నాయి. గత పదేళ్లలో ఉమ్మడి జిల్లా పారిశ్రామిక ప్రగతి వైపు అడుగులు వేసింది. ఇలా గత పదేళ్లలో ఏమేమీ కంపెనీలు వచ్చాయి... ఎంత మందికి ఉద్యోగావకాశాలు లభించాయి... మౌలిక వసతుల అభివృద్ధి ఎలా జరిగింది అనే అంశాలను టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్ 'సాక్షి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పరిశ్రమలతో సమ్మిళిత అభివృద్ధి..

పారిశ్రామిక ప్రగతి ద్వారా ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందడమే కాకుండా వందలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వ్యవసాయ ఆధారిత కంపెనీలతో పాటు ఇండస్ట్రియల్ పార్కు, మెగా టెక్స్ టైల్ పార్కు, స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు, స్పెషల్ ఎకానమిక్ జోన్లు 2014 నుంచి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఇలా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలతో పాటు ఇతర పరిశ్రమల అభివృద్ధి ద్వారా సొంతూళ్లనే ఉంటూ వందలాది మందికి ఉపాధి లభిస్తుందనే ఉద్దేశంతో ఆయా పరిశ్రమలను నెలకొల్పేందుకు భూమితో పాటు మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.వందల కోట్లు వెచ్చించింది. ఈ మేరకు వరంగల్, హనుమకొండ, జనగామలో ఇండస్ట్రియల్ పార్కు, మెగా టెక్స్ టైల్ పార్కు, స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు, స్పెషల్ ఎకానమిక్ జోన్లు ఏర్పాటయ్యాయి. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, వాటర్, విద్యుత్ తో పాటు వివిధ సౌకర్యాలు కల్పించి బడా కంపెనీలు ముందుకొచ్చేలా కసరత్తు జరిగింది. ముఖ్యంగా జిల్లాలో ఎక్కువగా వరి, పత్తి, పప్పుదినుసులను సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ పంటలకు అనుకూలంగా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. జిల్లాలో ఉత్పత్తి చేసిన పంటలతో స్థానికంగానే ఆహార ఉత్పత్తి జరగనుంది. పంటలను ఈ పరిశ్రమలకు తరలించి ఆహారోత్పత్తులను తయారు చేయనున్నారు. అలాగే, మెగా టెక్స్‌టైల్ పార్కు పత్తి రైతులకు ఎంతో లాభం చేకూర్చనుంది. వీరికే కాకుండా రవాణా ఆధారిత రంగంపై ఆధారపడి ఉన్న వారికి కూడా ఈ పరిశ్రమల ద్వారా ఉపాధి లభించే అవకాశముంది.



టీఎస్ఐఐసీ వరంగల్ జోనల్ కార్యాలయం

- వరంగల్ జిల్లా గీసుకొండ మండలం శాయంపేట గ్రామ పంచాయతీ పరిధిలో కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కును 1350 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేశారు. ఎవర్ టప్ టెక్స్ టైల్ అండ్ అప్పరల్ కాంప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు 297.59 ఎకరాలు కేటాయించడం ద్వారా 23,561 మందికి ఉద్యోగావకాశాలు, కైటెక్స్ గ్రూప్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 191.24 ఎకరాల కేటాయింపు ద్వారా 12,000 మందికి ఉపాధి అవకాశాలు, గణేశా ఎకోపేట్ ప్రైవేట్ లిమిటెడ్ అండ్ గణేశా ఎకోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 50.10 ఎకరాల కేటాయింపు ద్వారా 716 మందికి ఉపాధి లభిస్తోంది. ఇంకా మరికొన్ని కంపెనీలు ఇక్కడా రూ.కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. ఈ పార్కు పీఎం మిత్ర కింద ఎంపిక కావడం ద్వారా మరింత అభివృద్ధి జరిగి ఇంకా కంపెనీల సంఖ్య పెరిగే అవకాశముంది. తద్వారా వేలాది మందికి ఉపాధి లభించొచ్చు.




- మడికొండ టెక్స్ టైల్ పార్కు కోసం హనుమకొండ జిల్లా మడికొండలోని 1791/1 సర్వే నంబర్‌లో 161.33 ఎకరాలు టీఎస్ఐఐసీకి కేటాయించింది. వీటిలో 60 ఎకరాలు కాకతీయ టెక్స్ టైల్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ పొదుపు, పరపతి పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్‌కు టెక్స్ టైల్ పార్కు కోసం కేటాయించారు. అలాగే, మడికొండ ఇండస్ట్రియల్ పార్కుకు కేటాయించిన 175.22 గుంటల్లో 215 ప్లాట్లు అభివృద్ధి చేసి 214 మందికి కేటాయించారు. సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పారా బాయిల్డ్ రైస్ మిల్లులు, ప్రభుత్వ సంస్థలకు కేటాయించారు. రాంపూర్ ఇండస్ట్రియల్ పార్కులో 189.10 ఎకరాల్లో 265 ప్లాట్లు అభివృద్ధి చేసి పలు కంపెనీలకు కేటాయించారు. సీడ్ ప్రాసెసింగ్, గ్రానైట్ టైల్స్, పెస్టిసైడ్, అగ్రికల్చర్ ఇంప్లిమెంట్స్ అండ్ ఫ్యాబ్రికేషన్, ఫ్లష్ డోర్‌లు, రబ్బర్ ఇండ్స్, పారా బాయిల్డ్ రైస్ మిల్లులు, సిమెంట్ ఆధారిత ఉత్పత్తులు, పవర్ లూమ్స్, సిమెంట్ పైపు కంపెనీలు ఉన్నాయి.
- మడికొండలో స్పెషల్ ఎకానమిక్ జోన్ (ఎస్ఈజెడ్) కు 45 ఎకరాలుంటే వీటిలో నోటిఫైడ్ సెజ్‌కు 35.95 ఎకరాలు, నాన్ సెజ్‌కు 9.05 ఎకరాలు కేటాయించారు. రెండు ఎకరాల్లో ఐటీ ఇంక్యూబేషన్ సెంటర్ నిర్మించారు. జెన్ ప్యాక్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, టెక్ మహీంద్రాకు 30,000 చదరపు అడుగుల స్థలంన్ని కేటాయించారు. 18.31 కోట్లతో మౌలిక వసతులు అభివృద్ధి చేశారు. సియంట్ లిమిటెడ్‌కు 5.08 ఎకరాలు, సహి సిస్టమ్‌కు 4.94 ఎకరాలు, లెనోరా ఐటీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 1.42 ఎకరాలు, ఏకే రాపోలు థియోరెమ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 1.26 ఎకరాలు, టెక్ వేవ్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 1.57 ఎకరాలు కేటాయించారు. వేలాదిమందికి ఉపాధి కల్పించారు.

వంగర స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో శ్రీకృష్ణ ఆయిల్ మిల్స్ అండ్ శ్రీ కృష్ణ ఆగ్రోటెక్ లకు ఏడు ఎకరాలు, మణికంఠ కన్సర్న్‌కు 25 ఎకరాలు, కరానీ స్పైసెస్‌కు మూడు ఎకరాలు, జ్యోతి ఎంటర్ ప్రైజెస్‌కు రెండు ఎకరాలు, రోని ఇండ్స్ అండ్ ఫుడ్ ప్రొడక్ట్స్‌కు 1.08 ఎకరాలు, సామిత్ ఇండస్ట్రీస్‌కు మూడు ఎకరాలు కేటాయించారు. ఎంఎస్ఎంఈలకు 46 ఎకరాలు కేటాయించారు. ఇలా వరంగల్, హనుమకొండలోని ఈ పరిశ్రమల మౌలిక వసతుల కోసం రూ.803.25 కోట్లు వ్యయం చేస్తే 385 యూనిట్ల ద్వారా 10,412 మందికి ఉపాధి లభించింది. అలాగే, ములుగు జిల్లా మంగపేట మండలం బిల్ట్ పరిశ్రమ పునరుద్ధరణకు అడుగులు పడ్డాయి. దీని ద్వారా ఇక్కడ జమాయిల్ కలప సాగు పెరగడంతోపాటు వేలాది మందికి ఉపాధి లభించనుంది. దీంతోపాటు మహబూబాబాద్ జిల్లాలో గ్రానైట్, టైల్స్ పరిశ్రమలు విపరీతంగా ఉన్నాయి. దాదాపు వందల సంఖ్యలో విస్తరించి ఉన్నాయి. ఇక్కడ లభించే సహజ వనరులు ఈ పరిశ్రమలకు ఊతమిస్తున్నాయి. ఈ కంపెనీల్లో వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- రేపటి నుంచి టీఎస్ఐసెట్
- హాజరుకానున్న 4,029 మంది అభ్యర్థులు



కేయూ క్యాంపస్ : ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఈనెల 5, 6 తేదీల్లో టీఎస్ఐసెట్-2024 పరీక్ష నిర్వహించనున్నారు. అందుకు పూర్తి ఏర్పాట్లు చేసినట్లు టీఎస్ఐసెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి సోమవారం తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ, వరంగల్, నర్సంపేటలో కలిపి ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వరంగల్ కిట్స్, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ, నోబుల్ టెక్నాలజీ, వశిష్ట టెక్నాలజీ, తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాల, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల, నర్సంపేటలోని బాలాజీతో పాటు జయముఖి ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలుండగా, ఆన్‌లైన్‌లో (సీబీటీ) పరీక్ష నిర్వహిస్తారు. 4,029 మంది అభ్యర్థులు ఈ ప్రవేశ పరీక్ష రాయబోతున్నారు. రేపు (బుధవారం)మొదటి సెషన్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అలాగే ఈనెల 6న (గురువారం) ఉదయం ఒక సెషన్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలని, నిర్దేశిత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోరని కన్వీనర్ తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలతో పరీక్ష కేంద్రాల్లోకి రావొద్దని, హాల్‌టికెట్‌తో హాజరుకావాలని టీఎస్ఐసెట్ కన్వీనర్ నర్సింహాచారి తెలిపారు.

కాళేశ్వరం బ్యారేజీల పరీక్షల కోసం నిధులు మంజూరు!



కాళేశ్వరం: గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డ(లక్ష్మి), అన్నారం(సరస్వతి)బ్యారేజీల్లో మరమ్మతుల నిమిత్తం పలు పరీక్షల కోసం తెలంగాణ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జియోఫిజికల్, జియోటెక్నికల్, సీపేజీల్లో బోర్‌వెల్ తదితర పరీక్షల కోసం మేడిగడ్డ బ్యారేజీకి రూ. 2.46కోట్లు, అన్నారం బ్యారేజీకి రూ. 1.13కోట్లు మంజూరు చేసినట్లు ఇంజనీరింగ్ వర్గాల ద్వారా తెలిసింది.

మిత్రుడి వద్దకు వెళ్తూ.. అనంతలోకాలకు

- ట్రాక్టర్, కారు ఢీ.. ఒకరి దుర్మరణం
- ముగ్గురికి గాయాలు

ఐనవోలు: మిత్రుడి వద్దకు వెళ్తున్న ఓ యువకుడిని మృత్యువు కారు రూపంలో కబళించింది. మరో ముగ్గురిని గాయాలపాలు చేసింది. ఈ ఘటన మండలంలోని వరంగల్ -ఖమ్మం రహదారి పంథిని శివారులో చోటు చేసుకుంది. ఎస్సై గైకడి అనిల్ కుమార్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని వెస్ట్ గోదావరి జిల్లా ఇరగవరం మండలం ఏలేటిపాడుకు చెందిన కే రవినాగబాబు (35).. కరీంనగర్ జిల్లాలో ఉన్న తన మిత్రుడు వెంకన్న వద్దకు ఆదివారం సాయంత్రం మిత్రులు లోవ రాజు, సుధాకర్, వరప్రసాద్, ఏసుతో కలిసి కారులో బయలుదేరాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున పంథిని శివారుకు చేరుకోగానే కారు ఎదురుగా భట్టుపల్లి నుంచి నల్లగొండ షోరూమ్‌కు వెళ్తున్న కొత్త ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కౌజు రవినాగబాబు అక్కడికక్కడే మృతిచెందగా ట్రాక్టర్ డ్రైవర్ పిట్టల సిద్ధు, కారు డ్రైవర్ లోవ రాజుతో పాటు వరప్రసాద్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనపై మృతుడి భార్య కౌజు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఘటనా స్థలిలో కౌజు రవినాగబాబు మృతదేహం

గొర్లవీడులో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి..

భూపాలపల్లి రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం భూపాలపల్లి మండలం గొర్లవీడులో జరిగింది. గ్రామానికి చెందిన పప్పుల సాంబయ్య (40).. గొర్లవీడు, వజినపల్లి గ్రామాల మధ్య రోడ్డు పక్కన ముళ్ల పొదల్లో పడి ఉన్నాడు. గమనించిన గ్రామస్తులు.. కుటుంబీకులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. సాంబయ్య మృతి చెంది ఉండగా బోరున విలపించారు. కాగా, గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో సాంబయ్య మృతి చెందినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



సాంబయ్య మృతదేహం

చికిత్స పొందుతున్న కూలీ మృతి

కాజీపేట : కాజీపేటకు చెందిన మోటం బెనని (34) వడదెబ్బకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం.. మేడ్చల్ జిల్లాకు చెందిన మలాలీ బతుకుదెరువు కోసం నాలుగు సంవత్సరాల క్రితం కాజీపేటకు వచ్చాడు. ఇక్కడ కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మలాలీ కుమారుడు బెనని కూడా కూలీకి వెళ్తుంటాడు. మద్యం సేవించిన అనంతరం పట్టణంలో ఎక్కడపడితే అక్కడే సంచరిస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం వడదెబ్బ తగలడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మలాలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వివరించారు.



బెనని (ఫైల్)

భార్య పుట్టింటికి వెళ్లిందని..

- భర్త ఆత్మహత్య

కాశిబుగ్గ : భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపం చెందిన భర్త.. రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం కాజీపేట దర్గా రైల్వేగేట్ సమీపంలో చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేశ్ కథనం ప్రకారం.. జనగామ జిల్లా కొడకండ్ల మండలం లక్ష్మక్కపల్లికి చెందిన గుగులోత్ రవి(32) మేస్త్రీ పనిచేస్తూ హనుమకొండ జిల్లా కాజీపేట దర్గా ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. 41 రోజులు హనుమాన్ మాల ధరించిన రవి.. ఆదివారం మాలవిరమణ చేశాడు. సాయంత్రం అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య అనితతో గొడవ పెట్టుకుని కొట్టాడు. దీంతో అనిత తమ ఇద్దరు పిల్లలను తీసుకుని ఆదివారం పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన రవి.. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో భార్యకు ఫోన్ చేసి 'నువ్వు ఇంటికి రాకపోతే నేను రైలు కింద పడి చనిపోతున్నా' అని చెప్పి ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి రాజు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి భార్యకు అప్పగించామని సీఐ తెలిపారు.



రవి (ఫైల్)

రోటావేటర్‌లో పడి రైతు దుర్మరణం

- వంగిడిపల్లిలో ఘటన

కమలాపూర్ : ట్రాక్టర్ రోటావేటర్‌లో పడి ఓ రైతు దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమవారం కమలాపూర్ మండలం పంగిడిపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు నాగుల శ్యాంప్రసాద్ (38) తన వ్యవసాయ భూమిని ఇదే గ్రామానికి చెందిన లకిడె రవికి చెందిన ట్రాక్టర్ రోటావేటర్‌తో దున్నిస్తున్నాడు. భూమి దున్నుతున్న క్రమంలో శ్యాంప్రసాద్ రోటావేటర్‌లో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై వీరభద్రరావు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై వీరభద్రరావు తెలిపారు.



శ్యాంప్రసాద్ (ఫైల్)

సబ్బండ వర్గాల కృషితోనే తెలంగాణ



సన్మాన గ్రహీతలతో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఇతరులు

- రాష్ట్ర ఏర్పాటులో సోనియాగాంధీ పాత్ర కీలకం
- మంత్రులు పొన్నం ప్రభాకర్, ధనసరి సీతక్క

హన్మకొండ చౌరస్తా : సబ్బండ వర్గాల సమిష్టి కృషితోనే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని 'డి' కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తొలి, మలి దశ ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, ధనసరి సీతక్క ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, యశస్వినిరెడ్డి, కేఆర్ నాగరాజు, గడ్డం వివేక్‌తో కలిసి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం ఫుట్‌బాల్ ఆట లాంటిదని, అందరూ కలిసికట్టుగా ఆడితేనే రాష్ట్రం సిద్ధించిందన్నారు. స్వరాష్ట్ర ఉద్యమంలో అమరులవుతున్న యువకుల గాథ విని చలించిన సోనియాగాంధీ.. తెలంగాణ ఏర్పాటు చేశారన్నారు. నూతనంగా ఏర్పాటైన రాష్ట్రంలో అధికారం చేపట్టిన కేసీఆర్ తన పదేళ్ల పాలనలో వనరులు దోచుకుని రాష్ట్రాన్ని నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తెచ్చింది... తెలంగాణ ఇచ్చింది.. కాంగ్రెస్ పార్టీనేనని ఉద్ఘాటించారు. ప్రజలందరి గొంతుకై ప్రాణాలకు తెగించి పార్లమెంట్‌లో కొట్లాడామని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ అన్నారు. తెలంగాణ పేరు చెప్పుకుని ఏనాడు రాజకీయాలు చేయలేదన్నారు. గత ప్రభుత్వంలో అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు అమరుల కుటుంబాలకు ఉద్యోగాలు, రూ.25 వేల పెన్షన్, ఇంటి స్థలం ఇస్తామన్నారు. ఉద్యమకారులకు ఎక్కడా అగౌరవం కలగకుండా చూసుకుంటామన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తొలి, మలిదశ ఉద్యమకారులను సన్మానించడం అభినందనీయమన్నారు. అనంతరం తెలంగాణ సాధన ఉద్యమంలో పాల్గొన్న తొలి, మలిదశ ఉద్యమకారులను సన్మానించారు. కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ పార్లమెంట్ సభ్యులు పసునూరి దయాకర్, మధుయాష్కీ, అంజన్‌కుమార్ యాదవ్, సీతారాంనాయక్, సిరిసిల్ల రాజయ్య, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ పాపిరెడ్డి, కూరపాటి వెంకటనారాయణ, వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరావు, కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రియాజ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెరమండ్ల రామకృష్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, సీనియర్ నాయకులు బొల్లె పోగు రమేశ్ బాబు, శనిగరం వెంకటేశ్, ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, ముప్పు మహేందర్, హింగే శ్రీకాంత్, అంబాల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



కార్యక్రమంలో నృత్యం చేస్తున్న కళాకారులు

రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్రమే పడగొడుతుంది

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జనగామ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏడాదిలో కేంద్ర ప్రభుత్వం కూల్చబోతున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని జనగామ జిల్లా యశ్వంతాపూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారుకు నూకలు చెల్లినట్లే.. తెలంగాణలో త్వరలో జగబోయే ఉప ఎన్నికల్లో కేసీఆర్ మూడోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. మంగళవారం చేపట్టే పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపులో ఫలితాలు ఎలా ఉంటాయో తెలియదని, కేడర్ ధైర్యంగా ఉండాలని అన్నారు. ఢిల్లీ రాజకీయాలను పక్కన బెట్టి.. స్థానిక సంస్థల విజయమే లక్ష్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏ ఒక్కరోజు కూడా అండగా నిలవలేదని, అమర వీరులకు నివాళులర్పించే అర్హత ఆయనకు లేదన్నారు. రేవంత్‌కు మద్దతుగా నాడు కడియం శ్రీహరి.. చంద్రబాబు పంచన చేరి నాలుగున్నర కోట్ల మంది ప్రజలకు వ్యతిరేకంగా పనిచేశారని ఆరోపించారు. రాష్ట్రంలో జిల్లాల తొలగింపులో మొదటి వరుసలో జనగామనే ఉందని.. ఈ ప్రాంత ప్రజలు మరో పోరాటానికి సిద్ధం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇటీవల కడియం శ్రీహరి చేసిన కామెంట్స్ ఇందుకు నిదర్శనమన్నారు. భవిష్యత్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, నియోజకవర్గాల్లో కాంగ్రెస్ చేస్తున్న అక్రమ దందాలు, అడ్డదారి సంపాదనకు అలవాటు పడిన వారిపై తిరగబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

కాంగ్రెస్ వేడుకలా దశాబ్ది ఉత్సవాలు..

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు.. కాంగ్రెస్ ఉత్సవాలను తలపించాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. సోమవారం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని పల్లా రవీందర్ రెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటులో సీఎం రేవంత్ రెడ్డి పాత్ర శూన్యమని, ఉద్యమంలో పాల్గొనని వారు ఉత్సవాలు చేస్తే ఎలా ఉంటుందో ఈ ఉత్సవాలు అలా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఏర్పాటులో ముగ్గురు మహిళల పాత్ర కీలకమని, పార్లమెంట్ చరిత్రలో ఏ స్పీకర్ చేయని విధంగా మీరాకుమార్ వ్యవహరించారన్నారు. ఆమెతోనే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందన్నారు. సీఎం రేవంత్ వ్యవహార శైలి.. తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టిన సుశీల్ కుమార్ షిండే, మాజీ స్పీకర్ మీరా కుమార్‌ను అవమానించేలా ఉందని విమర్శించారు. రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను ఎందుకు తొలగిస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ గీతాన్ని గుర్తించడంలో కేసీఆర్ పదేండ్లు పొరపాటు చేస్తే, జయ జయహే తెలంగాణ పాటలో పదమూడు చరణాలలో మూడు మాత్రమే పెట్టి రేవంత్ రెడ్డి పాటను చంపిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొమురం భీం, పండుగ సాయన్న, సర్వాయి పాపన్న, కంచర్ల గోపన్న వంటి పోరాటయోధుల పేర్లు తొలగించిన పాటను మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఎలా ఆమోదించారని ప్రశ్నించారు. అందెశ్రీ రాసిన పాటలో రెడ్డి సామాజిక వర్గం పేర్లు లేకపోవడంతో బహుజనుల పేర్లు తొలగించారని ఆరోపించారు. పోరాట స్ఫూర్తిని నిద్రబుచ్చే పాటకు నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారుల చావుకు సోనియాగాంధీ కారకురాలు కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులను కాల్చి చంపిన కాసు బ్రహ్మానందారెడ్డి పేరు తెలంగాణలో ఎక్కడా కనిపించొద్దని, ఆయన పేరుమీద ఉన్న పార్కును అమరుల పార్కుగా మార్చి తెలంగాణ అమరుల స్మృతి వనంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేశ్ మాదిగ, అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ, నాయకులు, మంద కుమార్ మాదిగ, సూరన్న మున్నూరు కాపు, మంద రాజు మాదిగ, జన్ను దినేశ్ మాదిగ, బండారి సురేందర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

నేడు సరోజినిదేవి అంత్యక్రియలు

- రిటైర్డ్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు తల్లి మృతి
- ఫోన్ ట్యాపింగ్ కేసులో జైలులో ఉన్న ఆయనకు కోర్టు మధ్యంతర బెయిల్

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన రిటైర్డ్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ(ప్రస్తుతం ఫోన్ ట్యాపింగ్ కేసులో జైలులో ఉన్న) పొట్లపల్లి రాధాకిషన్‌రావు తల్లి సరోజినిదేవి(98) ఆదివారం రాత్రి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మనుమరాలికి చెందిన ఆస్పత్రిలో అనారోగ్యంతో కన్నుమూశారు. మృతురాలికి నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. చిన్నవాడైన రాధాకిషన్‌రావు ఫోన్ ట్యాపింగ్‌కేసులో జైలులో ఉన్నారు. తల్లి అంత్యక్రియలు నిర్వహించేందుకు సోమవారం బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు కోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దీంతో నేడు(మంగళవారం) స్వగ్రామమైన పల్లగుట్టలో జరిగే తల్లి అంత్యక్రియలకు హాజరుకానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నల్లబెల్లం పట్టివేత

తొర్రూరు రూరల్: మండలంలోని వెలికట్టలో ఎక్సైజ్‌శాఖ అధికారులు సోమవారం నల్లబెల్లం పట్టుకున్నారు. తొర్రూరు ఎక్సైజ్ ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. ఓ వ్యక్తి టాటాఏస్ వాహనంలో బీదర్ నుంచి కేసముద్రానికి నల్లబెల్లం, పటిక తరలిస్తున్నాడని సమాచారం వచ్చింది. దీంతో సిబ్బంది వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై వెలికట్ట శివారులో వాహనాలు తనిఖీ చేసింది. ఇందులో టాటాఏస్ వాహనంలో మూడు టన్నుల నల్లబెల్లం, 1.5 క్వింటాల పటిక, ఐదు లీటర్ల లిక్కర్ లభ్యమైంది. దీంతో సరుకు స్వాధీనం చేసుకుని నిందితుడు మినుకుంట్ల నరేశ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై చెప్పారు.